

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# స్త్రీ – సుఖము

***"తులారాశి వారికి: ఈ రోజు, రేపుల్లో మీకు స్త్రీ వలన సుఖము కలదు. "***

అంతే, ఆ తరువాత నాకళ్ళు ఎదరకి పోలేదు. నా కళ్ళని నేనే నమ్మలేక లాప్ టాప్ మీదికి రెండు వేళ్ళు పోనిచ్చి స్క్రీన్ ని పైకి తోసాను. ఆనక గుర్తొచ్చింది, అది టచ్ స్క్రీన్ కాదని. బుద్ధిగా నా ఎలకని కదిపి మళ్ళీ చదివాను. నేను చదివింది కరెక్టే. నాకు ఆశ్చర్యం వేసిపోయింది. స్త్రీవలన సుఖమా? ఇదేదో కొత్తగా వుందే అనుకుంటూ, ఎదర చదవడం మొదలెట్టాను.

***ఈ రోజు వీనస్ మీ వంటింట్లోను, జూపిటర్ మీ లాండ్రీ రూం లోను, గెలీలియో మీ గెరాజ్ లోనూ ఉండుట వలనన్ (కంటెన్, పట్టిన్) జేసి, మీకు ఆడవారివలన సుఖము కలదు. అన్యధా భావించవద్దు. అనుకోని పరిమాణాలు, ఐ మీన్ పరిణామాలు సంభవించే అవకాశం పుష్కలంగా వుంది. యురేనస్ మీ కళ్ళలో మెరుపునీ, నెప్ట్యూన్ మీ బోడి బాడీ లో నునుపునీ పెంచుతారు. మీలో మునుపెన్నడూ లేని ఆకర్షణ చేరుతోంది. అన్యధా భావించవద్దు. వీలైతే దయ చేసి ఈ రోజు ఆఫీసుకూ, రేపు పార్టీలకూ వెళ్ళవద్దు. చాలా మంది కి హార్ట్ బ్రేక్ అయ్యే అవకాశం ఇవ్వద్దు. మొహమాటానికి పోయి ఒప్పేసుకుంటే చిక్కుల్లో పడతారు. ఆనక మీ ఇష్టం. "***ఇట్లు మన్మధరావు.. గ్రేట్ బ్రెయిన్ డాట్ కాం.

స్క్రీన్ మీంచి కళ్ళు తీసి చుట్టూ చూసాను. పెపంచం అంతా నన్నే

"**దా దా, మా అమ్మ దా, మన్మధా..**" అని పిలుస్తున్నట్టుగా వుంది.

"**నిన్న లేని అందమేదో**" అనే పాట పెదాలమీదకొచ్చేసింది. ఒక్కసారి చొక్కా పీకిబొత్తం కూడా పెట్టేసి,

"**పల్లవీ, టై పట్రామ్మా**" అని అరిచాను.

"**అది స్కూలుకెళ్ళి రెండు గెంటలైంది. అయినా ఇప్పుడు టై ఎందుకు, పెంటలదొర లాగ**" అంటూ కిందకి దిగింది మా ఆవిడ.

"**నీ నోట్లో సున్నుండ చిదమా!, ఎంత సున్నితంగా చెప్పావే**" అన్నాను లాప్ టాప్ మూసి సంచీలో కుక్కుతూ.

"**లేకపోతే ఇంతోటీ కొలువుకీ టై ఒకటీ, దండగ, ఇంతకీ నా లూయి వటాన్ బేగ్ కనపట్టంలేదు, మీరేవన్నా తీసారా?**" అంది అమాయకంగా.

"ఒసేయ్, నేనేవన్నా సంచీలెత్తుకుపోయే వాడిలా కనపడుతున్నానా, ఖపడ్దార్, అసలు నీకు ఇవాళ నా పవరేమిటో **చూపిస్తా..**" అన్నాను గుఱ్ఱంలా సకిలిస్తూ.

"**మహాప్రభో, చూపించిందీ చాలు, చూసిందీ చాలు, ఇంక నా వల్లకాదు**" అంది నవ్వుతూ.

"ఏవిటా డబల్ మీనింగ్ డైలాగులూ నువ్వూను. ఇవాళ అయాం బాబు గారి జాతకంలో స్త్రీ సౌఖ్యం వుందిట తెలుసా? " అన్నాను రాజసంగా కాళ్ళూపుతూను.

"ఓహో అదా, అయితే కాళ్ళు పట్టమంటారా?" అంది ఉడికిస్తూ.

"కాళ్ళు పట్టడం, పీకి పిసకడం జాంతా నై. ఇవాళ స్త్రీ వలన సుఖం కావాలి, అంతే, దట్సాల్ దటీజ్ ఫైనల్" అన్నాను నిశ్చయంగా.

"అది సరే గానీ మీరు నిన్న నేనడిగిన దానికి సమాధానం చెప్పనేలేదు, ఇప్పుడు చెప్పండి. ఒకవేళ నేను బక్కెట్టు తన్నేస్తే, మీరు మళ్ళీ ఎవర్ని చేసుకుంటారు చెప్పండి?" అంది ఉత్సాహంగా.

"ఛీ, అవేం మాటలే పొద్దున్నేను, ఇంతోటీ స్త్రీ సుఖానికీ నువ్వు చచ్చిపోవడమెందుకే?" అన్నాను అనునయిస్తూ.

"అంటే, నేనుండగానే, మీరు, హమ్మ మీ అసాధ్యం కూల, వుండండి ఇప్పుడే వచ్చి మీ పని చెపుతా" అని పైకి పరిగెత్తింది.

నా క్లాజెట్ లోకి వెళ్ళి బట్టలన్నీ వాసన చూసి, బాత్రూం లోకెళ్ళి ఓ మాటు దోక్కుని వచ్చింది. "మీరు ఏడాదికోసారన్నా ఉతుక్కోరా బట్టలు? అన్నీ చెవట ఖంపు కుదుతున్నాయి" అంది కోపంగా.

"నిన్ను కుక్కలా వాసనెవడు చూడమన్నాడు?" అన్నాను నేను చిరాగ్గా.

"అంటే అలా చూస్తే, వేరే వేరే సెంటు వాసనలొస్తే అప్పుడు తెలిసిపోతుందన్నమాట మీరు ఎవరెవరితో తిరుగుతున్నారో.." అంది అమాయకంగా.

"తిక్క కుదిరిందా, నా బట్టల స్మెల్ తో ఆడాళ్ళనీ మగాళ్ళానీ కలిపి అరవై అడుగుల దూరంలో ఉంచుతాను, నీ మొగుడు నిప్పు, నిప్పు లాంటి మనిషి, ఏమనుకుంటున్నావో.." అన్నాను గర్వంగా.

"అబ్బ, ఆపుదురూ మాయ దారి నిప్పూ మీరూను, ఇంతకీ ఎవర్ని చేసుకుంటారు? షీలా...నా? చేసుకోండి. అది కూడా మీలాగే గుండ్రం గుండ్రం గా వుంటుంది. చూడ్డానికి బావుంటారు మీరు పక్క పక్కనే, పడుకోబెట్టిన ఎనిమిదంకెలాగ" అంది నవ్వుతూ.

"నీ పోలికకి నిప్పెట్టా, నీకు షీలాయే దొరికిందా" అన్నాను కోపంగా.

"పో..నీ..ఆ..ఆ..రీమా, కరెక్ట్. మీరూ, రీమా భలే వుంటారు బ్లాక్ అండ్ వైట్ టీవీలాగ. ఉండండి రీమా కి ఫోను చేద్దాం" అంది ఫోను తెస్తూను.

"చెయ్యి, చేసి ఏవడుగుతావు, ఒసేయ్ రీమా, ఒక వేళ నేను, మీ ఆయన బకెట్ తన్నేస్తే, నువ్వు మా ఆయన్ని చేసుకుంటావా అని అడుగుతావా, ఉప్పు పాతరేస్తుంది, వెధవ టాపిక్కూ నువ్వూను" అన్నాను ఆఫీసుకి బయల్దేరుతూ.

"ఇవాళ మీరు చెబితేనే గానీ ఆఫీసుకి పంపనుగా, చెప్పండి, ఉత్తినే సరదాకి, ఎవర్ని చేసుకుంటారు?" అంది మళ్ళీ మొదలెడుతూ.

"పోనీ చివరి మాట శీతల్, శీతల్ ని చేసుకుంటారా" అంది ఫైనల్ గా.

"ఆవిడ కూచుంటేనే మొహంలో మొహవెట్టి మాట్టాడ్డం కష్టం, నించుందంటే కొబ్బరి చెట్టులా ఆవిడ మొహం ఆకాశంలోకుంటుంది, మేమిద్దరం కలిసి వెడుతూంటే ఇల్లు, గేరేజీ కలిసి నడిచొస్తున్నట్టుగా వుంటుంది, వద్దంటే వద్దు" అన్నాను కారెక్కుతూ.

"సరే అయితే, రేపు మన తెలుగు సంఘం ఫంక్షన్ లో మాత్రం ఎవరో ఒకర్ని మీరు సెలెక్ట్ చేసుకోవాల్సిందే, ఉత్తినే సరదాకి.." అంది నవ్వుతూ.

"నీ సరదా శూర్పణకెత్తుకెళ్ళా, సాయంత్రం వచ్చాకా చెబుతా నీపని" అనేసి కారు రివర్స్ చేసి, మళ్ళీ రివర్స్ చేసి, రయ్యని దూసుకెళిపోయా.

కాస్త దూరం వెళ్ళానో లేదో వెనక సీట్లోంచి ఈల వినిపించింది. వెనక్కి చూసే ఓపిక లేక,

**"మేష్టారూ, మీకు లిఫ్ట్ కావస్తే అడగచ్చన్నమట, ఇలా ఎక్కేసి, ఈల వెయ్యడం బాలేదండీ, ముందు పక్క సీట్లోకి రండి"** అన్నాను అహ్వానిస్తూ.

ఓ నిముషం పోయాకా ఈల పక్క సీట్లోంచి వినబడింది. అక్కడెవరూ లేరూ. అంతే నాకొక్కసారి చెమటలు పోసేసాయి. డైరెక్టర్ స్వయంగా రాసిన పాట విన్నంత భయం వేసేసి **"ను, ను, మి మీ్మరు.."** అంటూ ఖంగారు పడిపోయాను.

**"ఆగు, ఇంద ఈ టెన్ డీ గ్లాసెస్ పెట్టుకో"** అని, ఆ శాల్తీయే నాకు కళ్ళద్దాలు తగిలించేసింది. అప్పుడు కనబడ్డాడు, అమూల్ స్ప్రే డబ్బా మీద కుఱ్ఱాడు అమాంతం పెరిగిపోతే ఎలావుంటాడో అలా వున్నాడు, పైగా జెర్కిన్ ఒహటి.

**"ఎవరు నువ్వు"** అన్నాను చిరాగ్గా మొహవెట్టి.

**"నేనొప్పుకోను, ఇంత అందంగా వున్నాను, మాములుగా ఎవ్వరికీ కనపడను, నేనెవరో చెప్పుకోలేవా"** అన్నాడు బుంగ మూతెట్టి.

**"కొంపతీసి మన్మధుడివా?"** అన్నాను నవ్వుతూ.

**"కరెక్ట్ అన్నమాట"** అన్నాడు ఆనందపడిపోతూ.

**"నువ్వెవ్వరికీ కనబడవు కదా, మరి ఇన్ని బట్టలెందుకు వేసుకోవడం, హాయిగా ఫ్రీగా వుండచ్చుకదా"** అన్నాను అనుమానంగా.

**"నీ అనుమానం సంతకెళ్ళా, ఎవ్వరికీ కనబడకపోతే మాత్రం నాకు బాడీ వుండదా? చలెయ్యదా, వెధవ డౌట్లూ నువ్వూను. ఇదిగో నా అప్ గ్రేడెడ్ ఫ్లవర్ గన్ చూసావా?"** అన్నాడు పాకెట్ లోంచి చిన్న పిస్టల్ తీస్తూ.

**"బానే వుంది గానీ, ఇవాళ, రేపు నా జాతకంలో స్త్రీవలన సౌఖ్యం ట తెలుసా?"** అన్నాను ఆత్రుతగా.

**"ఇవాళా, రేపా?"** అన్నాడు ఫ్లవర్ బాండు.

**"ఏమోనయ్యా, ఆ గ్రేట్ బ్రెయిన్ వాడు సరిగ్గా రాయలేదు, మొత్తానికి వుందనే అన్నాడు.."** అన్నాను.

**"అందుకే నేను నా ట్రిప్ ప్రీ పోన్ చేయించుకుని ఇవాళే తగలడ్డాను. ఇంక నా పని నన్ను చేసుకోనీ.."** అనేసి పక్కనే ఆగి వున్న కార్కేసి చూసి **"పేల్చనా"** అన్నాడు.

నేను చూడకుండానే **"ఊ, కానీయ్.."** అన్నాను.

వాడు ఓసారి తుపుక్కు మని పేల్చాడు. ఇంతలో ట్రాఫిక్ లైటొచ్చింది. అలవోకగా పక్కకు తిరిగి చూసాను. అక్కడో అరవైయేళ్ళ తెల్ల ముత్తైదువ, హాయిగా సిగరెట్టు కాలుస్తూ, నన్ను చూసి, విలాసంగా నా సైడు అద్దం మీదకి పొగ వదిలి "కళ్ళతోనే" హాయ్ చెప్పింది. నా గుండె కొట్టుకోడవా, మానడవా అని ఆలోచిస్తోంది. నేను కారు ముప్పై రెండో గేరులో వేసి రెడ్డు జంపుచేసి జంపైపోయాను.

**"కాస్త చూసుకుని పేల్చవయ్యా మగడా"** అన్నాను.

**"సరే, సరే ఈసారి రెడీ"** అంటూ ఆఫీసు పార్కింగ్ లాట్ లో అటు నడుస్తూన్న ఓ ఆడ లేడీసు మీద పేల్చాడు. అంతే ఆవిడ వెనక్కి తిరిగింది. ఆవిడ ఆఫీసు సెక్యూరిటీ ఆఫీసర్. ఆవిణ్ణి బ్రేక్ ఫాస్ట్ కి చూస్తే లంచ్ లోపల రెండు సార్లు కలలో కొచ్చేలా వుంటుంది. ఆవిడ స్టొను వింటే, నాలుగు ఫిరంగులు ఒక దాని తరవాత ఒకటి పేల్చినంత శ్రావ్యంగా వుంటుంది. ఆవిడ నాదెగ్గిరికొచ్చి

**"యు సిల్లీ, సెక్యూరిటీ ఆఫీసర్ని పూల తుపాకీతో కాల్చడం నేరం, అందుకే నిన్ను అరెస్ట్ చేస్తున్నాను"** అని ఇంగ్లీషులో అనేసి, రెండు చేతులూ బారగా చాపి మీదపడి నన్ను వాటేసుకుంది. ఆ ధృతరాష్ట్ర కౌగిట్లోంచి బైటపడి, ఎలివేటరెక్కి ఎగిరొచ్చి సీట్లో పడ్డా.

డబ్బా తెరిచి దగ దగా వాయించడం మొదలెట్టా. మళ్ళీ ఈల మొదలైంది.

**"ఇంక చాలు. ఇక్కడ కాలిస్తే, నిన్ను కాలుస్తా. నా మాటిను, ఉజ్జోగం పోద్ది.."** అన్నాను బెంగగా.

వాడు వినిపించుకోకుండా బైటున్న రిసెప్షనిష్టుని కాల్చాడు. అదెళ్ళి దాని ప్రింటర్ కి తగిలింది. ఆనక మా లేడీ బాసుని కాల్చాడు. అదెళ్ళి జిరాక్స్ మిషన్ కి తగిలింది. అప్పుడు నాకు డౌటొచ్చింది.

**"మేష్టారు, మీకు హెల్త్ ఇన్సూరెన్సుందా?"** అనడిగాను.

**"వుంది"** అన్నాడాయన.

**"మరి అర్జెంటుగా కళ్ళ డాక్టరుకి చూపించుకోండి. మీ కళ్ళు కొంచెం అవుటాఫ్ ఫేజ్ అయినట్టున్నాయి."** అన్నాను కోపంగా.

**"నన్నంత మాట అంటావా. నీ సంగతి రేపు చెబుతా. మీ తెలుగు సంఘం లో ఆడాళ్ళ ఫేషన్ షో వుందిగా, అక్కడ నీ పని చెప్తా.."** అనేసి వెళిపోయాడు.

కట్ చేస్తే, మర్నాడు సాయంత్రం, ఇంకా అందని స్త్రీ వలన సౌఖ్యం తలుచుకుంటూ తెలుగు సంఘం ప్రోగ్రాం కి వెళ్ళా. అక్కడ పెళ్ళాల ఫేషన్ షో జరిగింది. మొదటి వరసలో మా ఆవిడ, నేనూ, స్టేజి ఎక్కిన వాళ్ళందరి మొగుళ్ళూ వున్నాం. అదను చూసి మన్మధుడు గారు నా నెత్తిమీదే వేసేసాడు బాణం. అంతే నేనింక ఆగలేదు. పక్కనున్న ఆయనతో

**"మేష్టారూ, పెళ్ళైన వాళ్ళకి ఈ ఫేషన్ షోలేవిటండీ"** అన్నాను అనుమానంగా.

**"కలా పోసనన్నమాట. పొద్దత్తమానం దున్నపోతులాంటి మొగుణ్ణీ, పంది పిల్లల్లాంటి పిల్లల్నీ చూసి చూసి ప్రాణం విసిగిపోద్ది. అప్పుడు ఇలా రుమాళ్ళలాంటి జాకెట్లు, తువ్వాళ్ళలాంటి పైకట్టులూ కట్టేసి, నగలు గట్రా దిగేసి, జుట్టు ఓ పక్కకి ఒదిలేసి, ఈ చెవికి ఓ చెగోడీ, ఆ చెవికో చెగోడీ తగిలించుకుని ఇలా వచ్చేస్తారన్నమాట"** అన్నాడు చొంగ కారుస్తూ.

ఇంతలో వెనక సీట్లో ఒకాయన నా డిప్పమీద ఓటిచ్చి

**"ఉష్..నిశ్శబ్దం, మా ఆవిడ అదిగో, వస్తోంది వస్తోంది చూడండి చూడండి"** అన్నాడు.

ఇంక నాలో మన్మధుడు రెచ్చిపోయాడు. వెంటనే వెనక్కి తిరిగి అతని చెయ్యి రుద్దుతూ, వాణ్ణీ, వాళ్ళా ఆవిణ్ణీ మార్చి మార్చి చూస్తూ **"నువ్వు చాలా అదృష్టవంతుడివి గురూ. దేనికైనా పెట్టి పుట్టాలి"** అంటూ వాడి బుగ్గలు కసిగా గిల్లేసి, వాడు కొట్టేలోపు పెళ్ళాంతో సహా జంపై ఇంట్లో వాలిపోయాను.

పిల్ల స్లీపోవర్ కెళ్ళిందన్న సంగతి గుర్తొచ్చింది. పెళ్ళాం హాయిగా వేయించిన ముద్ద పప్పు, వెల్లుల్లి పాయలు నూరిన చారు పెట్టింది. ఒక్కో ముక్కా శ్రద్ధగా, విడిగా వేయించి, మూకుడు నిండా బంగారు దుంప ముక్కలు, ఐమీన్ బంగాళ దుంప ముక్కలు వేయించింది. అవి ఆరగించి పక్కెక్కాను. ఆవిడ వంటిల్లు కడుక్కుని, డిష్ వాషరేసుకుని ఓ గంటకి పైకొచ్చింది.

**" ఏవోయ్, ఇలారా"** అన్నాను కంగారుగా. అనేలోపే వచ్చేసింది. గిరుక్కున వెనక్కి తిరిగి, నడ్డి చూపిస్తూ

**"ఒక్కమాటు గోకవా, ప్లీజ్, నాకందట్లేదు"** అన్నాను ముద్దుగా బతిమాలుతూ. అవిడెళ్ళి దువ్వెన్న తెచ్చి సుతారంగా గోకింది, వెన్నుపూసకి కాస్త పైన. వెన్నపూస లాంటి నా మనసుకరిగిపోయింది.

**"వీడి దుంప తెగ, కరెక్టే రాసాడు. ఇంతకన్న సుఖం ఎక్కడుంటుంది"** అనుకుంటూ మెల్లిగా నిద్రలోకి జారుకున్నా. ఆవిడమీదేసిన ఎడం చెయ్యి అలాగే ఉణ్ణిచ్చేసాను.

COMMENTS